76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2016-18

# రాజధాని వార్తలు

Voice of Voiceless

అమరావతి సంపుటి : 3 సంచిక 42, పేజీలు 4 వెల: రూ. 2.00
ఆంధ్రప్రదేశ్ ‘ రాజధాని’ తొలి తెలుగు వార పత్రిక సోమవారం 9 - ఆదివారం 15 జూలై, 2018




## 27న సుదీర్ఘ చంద్ర గ్రహణం

**రాజధాని వార్తలు డెస్క్ :** ఈ శతాబ్దం లోనే సుదీర్ఘ చంద్రగ్రహణం జులై 27 న ఏర్పడనుంది. జులై 27 రాత్రి ఏర్పడే ఈ చంద్ర గ్రహణం అరుణ వర్ణంలో దాదాపు 1.45 గంటల పాటు ఆకాశంలో కనువిందు చేస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. జులై 27 రాత్రి 10.40 గంటలకు ప్రారంభమయ్యే చంద్ర గ్రహణం జులై 28 న తెల్లవారుజామున 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఆ సమయంలో భూమి చుట్టూ నీడలు అలుముకుంటాయి. గత జనవరి 31 న ఏర్పడిన చంద్రగ్రహణాన్ని సూపర్ బ్లడ్ మూన్‌గా అభివర్ణించారు. ఇది 152 ఏండ్లకు ఒకసారి ఏర్పడే గ్రహణంగా అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే, గ్రహణ సమయంలో చంద్రుడు పూర్తిగా కనుమరుగు కావడానికి బదులు, భూ వాతావరణంపై ప్రసరించే సూర్యకాంతి వల్ల ఎరుపు రంగును సంతరించుకుంటాడు. అలాగే ఇదే సమయంలో 15 ఏండ్ల తర్వాత భూమికి చేరువుగా సూర్యుడి కక్ష్యలోకి అంగారకుడు కూడా రానున్నాడు. దీంతో జులై 30న భూమి, అంగారకుడి మధ్య దూరం 57.58 మిలియన్ కిలోమీటర్లుగా ఉంటుంది. ఆ రోజున అంగారక గ్రహం బృహస్పతి (జ్యూపిటర్) కంటే రెండు రెట్లు అధికంగా ప్రకాశిస్తాడు. కానీ వీనస్ కంటే దీని ప్రకాశం తక్కువగా ఉంటుంది. ఎలాంటి పరికరాలు అవసరం లేకుండా అంగారకుని చూసే అవకాశం ఉంటుంది. 2003లో అంగారక గ్రహం భూమికి సమీపంగా వచ్చింది. ప్రస్తుత వర్షాకాలం కావడంతో ఆకాశం నిర్మలంగా ఉంటే అంగారకుని



చూడవచ్చు. ఖగోళ పరంగా సూర్యుడు, చంద్రుడు, భూమి ఒకే కక్ష్య మీదకు వచ్చినప్పుడు సంపూర్ణ చంద్ర గ్రహణం ఏర్పడుతుంది. సూర్యుడు, భూమి ఎప్పటికి ఒకే మార్గంలో ఉన్నా చంద్రుడు ఈ మార్గానికి 5 డిగ్రీలు అటూ ఇటూగా తిరుగుతుంటాడు. సూర్యచంద్రుల మధ్యలో భూమి ఉన్న రోజు పూర్ణిమ అయితే సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే సరళరేఖలో ఉండి చంద్రుడు రాహువు వద్ద, కేతువు వద్ద గానీ ఉంటే చంద్రగ్రహణం ఏర్పడుతుంది. పూర్తిగా చంద్రబింబం కనపడకపోతే దాన్ని సంపూర్ణ చంద్రగ్రహణమనీ, కొంత భాగమే కనిపిస్తే దాన్ని పాక్షిక చంద్రగ్రహణమని అంటారు. చంద్రుడిపై పడే కిరణాలు భిన్న రంగుల్లో మారి ఎరుపు, నీలం రంగులో దర్శనమిస్తాయి.

## ముందస్తు’కు అందుకే తొందర లోకేశ్

రాజధాని వార్తలు, అమరావతి : ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన ఉప ఎన్నికల్లో భాజపాకు చావుదెబ్బ తగిలినందుకే ఆ పార్టీ ముందస్తు ఎన్నికలకు తొందరపడుతోందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రధాని మోదీకున్న జనాదరణను చూసే జమిలి ఎన్నికలకు భయపడుతున్నారంటూ భాజపా నేత రాంమాధవ్ చేసిన ట్వీట్‌పై లోకేశ్ ట్విటర్ వేదికగా ఈ విధంగా స్పందించారు. ఒకవేళ మోదీకి నిజంగానే జనాదరణ ఉంటే కర్ణాటక ఎన్నికల్లో ఆ పార్టీని ఎందుకు తిరస్కరించారని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఆ పార్టీకి చావుదెబ్బ తగలిందని విమర్శించారు. అందుకే ముందస్తు ఎన్నికలంటూ తొందర పడుతున్నారని మంత్రి లోకేశ్ అన్నారు.



## రైల్వే జోన్ సాధనకు నలుగురు చాలు పవన్

రాజధాని వార్తలు, విశాఖ: ఉత్తరాంధ్ర సమస్యలు తెలుసుకునేందుకు మంత్రి లోకేశ్ సైకిల్ యాత్ర చేయాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. అదేవిధంగా దిల్లీకి సైకిల్‌పై వెళ్లి నిరసన తెలపాలని పేర్కొన్నారు. చంద్రబాబు, లోకేశ్, పవన్, జగన్ కలిసి పోరాడితే విశాఖ రైల్వే జోన్ వస్తుందని చెప్పారు. తనపై రైల్వే కేసులు పెట్టినా ఈ విషయంలో తాను నిలబడతానని తెలిపారు. విశాఖలో బిచరోడలో నిర్వహించిన జన పోరాట సభలో ఆయన మాట్లాడారు. అంతకుముందు ప్రత్యేక హోదా, విభజన హామీల లక్ష్యసాధన లక్ష్యంగా విశాఖ బీచ్ రోడ్డులో జనసేన పార్టీ నిరసన కవాతు నిర్వహించింది. ఈ కవాతులో పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌తో పాటు పెద్దఎత్తున యువకులు పాల్గొన్నారు. కాళీమాత ఆలయం నుంచి వుడా పార్కు వరకు ఈ కవాతు సాగింది.





# ఐటీ వద్దు.. వ్యవసాయం ముద్దు

**రాజధాని వార్తలు కలం**

## హుందాగా వ్యవహరించాలి

ఇదివరలో ఎవరైనా ఒక్కరితో కూడా వేలు చూపించుకోరాదని, ఎటువంటి పరిస్థితుల్లోని గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించరాదని భావించేవారు. కాని ప్రస్తుత తరం మారింది.. విలువలు పాతాళానికి పాకాయి. రాజకీయాలు అద:పాతాళానికి చేరాయి. అందులో భాగమే ఢిల్లీ ప్రభుత్వానికి, కేంద్రానికి నడుమ పాలనాధికారాల విషయంలో తలెత్తిన ఘర్షణ. ఇదివరలో గవర్నర్లు హుందాగా ప్రవర్తించేవారు.ఆ పదవిలోకి రాగానే రాజకీయాలకు అతీతంగా ప్రవర్తించేవారు. అయితే రానురాను ఆ పరిస్థితి మారింది. అన్నింట్లో జోక్యం చేసుకోవడం, కేంద్రానికి తొత్తులుగా వ్యవహరించడం ఎక్కువయింది.

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్నికైన ప్రజాప్రభుత్వానికే పరిపాలనాధికారాలు ఉంటాయి మినహా కేంద్రానికి ప్రతినిధిగా ఉన్న లెఫ్టినెంట్ గవర్నర్‌కు కాదని సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పు చారిత్రాత్మకమైనది. ఈ తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రజాస్వామ్యానికి అద్దం పడుతోంది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం గద్దెనెక్కాక గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లను ఉపయోగించి ప్రత్యర్థి పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలపై పెత్తనం చెలాయిస్తోంది. అవాంఛిత జోక్యానికి పాల్పడుతూ రాష్ట్రాల అధికారాలను తన గుప్పెట్లోకి తెచ్చుకొని ప్రజాప్రభుత్వాల పరిపాలనను అడ్డుకుంటోంది. ఇదే సమయంలో వెలువడిన సుప్రీం తీర్పు బీజేపీకి చెంపపెట్టు. గతంలో కేంద్రంలో అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్ కర్నాటకలో జనతాదళ్‌కు చెందిన ఎస్ఆర్ బొమ్మరు ప్రభుత్వాన్ని కూల్చేసినప్పుడు ఆ చర్యకు వ్యతిరేకంగా సుప్రీం చారిత్రాత్మక తీర్పు చెప్పింది. కాంగ్రెస్ తన హయాంలో గవర్నర్లను పావుగా చేసుకొని అడ్డగోలుగా విపక్ష రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేసిందని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బీజేపీ నానా యాగీ చేసింది. అరవై ఏళ్లల్లో కాంగ్రెస్ చేసిన అరాచకాలను కేవలం నాలుగంటే నాలుగేళ్లల్లో మోడీ సర్కారు అధిగమించింది. ఢిల్లీ ప్రత్యేకతల రీత్యా రాజ్యాంగంలోని 239-ఎఎ అధికరణంలో ప్రకారం లెఫ్టినెంట్ గవర్నర్‌కు శాంతి భద్రతలు, పోలీసులు, భూములు ఈ మూడు అధికారాలను రిజర్వ్ చేశారు. గతంలో రిజర్వ్ చేసిన మూడు అధికారాలతో పాటు సర్వీసెస్‌పై గవర్నర్ తన విచక్షణ ప్రదర్శించవచ్చని ఉత్తర్వులిచ్చింది. ఆ లొసుగుతో కేజ్రీవాల్ సర్కారు ప్రమేయం లేకుండానే అధికారుల నియామకాలను లెఫ్టినెంట్ గవర్నర్ చేపట్టారు. దానిపై ఢిల్లీ హైకోర్టులో ఆప్ సర్కార్ సవాల్ చేయగా గవర్నర్‌కు ఆ అధికారాలుంటాయని హైకోర్టు తీర్పు చెప్పింది. హైకోర్టు తీర్పుపై కేజ్రీవాల్ ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానానికి వెళ్లగా చీఫ్ జస్టిస్‌తో సహా ఐదురుగు సభ్యులతో ధర్మాసనం ఏర్పడి విచారించింది. ధర్మాసనంలో ఇద్దరు న్యాయమూర్తులు చంద్రచూడ్, అశోక్‌భూషణ్‌లు విడివిడిగా తీర్పులు రాసి కేంద్ర, రాష్ట్ర సంబంధాల పటిష్టతకు, రాజ్యాంగంలో ఢిల్లీ కోసమే పొందు పర్చిన 239-ఎఎ అధికరణం అర్థాన్ని విపులీకరించి గవర్నర్ పాత్ర ఏ విధంగా ఉండాలో పేర్కొన్నారు. ఢిల్లీలో గవర్నర్‌కు స్వతంత్ర అధికారాలేమీ లేవని సుప్రీం తీర్పు స్పష్టీకరించింది. రాష్ట్ర మంత్రి మండలి సలహా మేరకు గవర్నర్ నడుచుకోవాల్సిందేనని మంత్రి మండలితో విభేదాలు తలెత్తినప్పుడు చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించింది.

ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ప్రజాస్వామ్యం ఘోషిస్తోంది. ప్రజా ప్రభుత్వాలు ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పాలించేందుకు అవసరమైన శాసనాలు చేసి అమలు పర్చాలి. ప్రజాభీష్టానికి విలువ ఇవ్వడం ప్రజాస్వామ్యంలో అత్యవసరం. కాగా ఢిల్లీలో గవర్నర్‌కు కేంద్రం దఖలు పర్చిన అధికారాలు ఎన్నికైన ప్రభుత్వాల చేతులు కట్టి పడేస్తున్నాయి. ప్రభుత్వాలు ప్రజల కోసం ఏమీ చేయలేని స్థితిని కల్పిస్తున్నాయి. ఈ విషయాన్ని సుప్రీం కోర్టు తన తీర్పులో ప్రముఖంగా ప్రస్తావించింది. ఇది సమాఖ్య వ్యవస్థకు భంగకరమని వ్యాఖ్యానించింది. సమాఖ్య తరహా ప్రభుత్వంలో అంతర్లీనంగా రాష్ట్రాల ప్రయోజనాలు ఇమిడి ఉంటాయని ఒకరి చేతుల్లో అధికారమంతా కేంద్రీకృతం కావడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని స్పష్టం చేసింది. రిజర్వ్ చేసిన మూడు అంశాలు తప్ప తక్కిన వాటిపై ఢిల్లీ ప్రభుత్వానికే సంపూర్ణ అధికారాలు కల్పించింది. మంత్రి మండలితో విభేదించిన పక్షంలో రాష్ట్రపతికి నివేదించి ఆయన ఇచ్చిన ఆదేశాలను అమలు పర్చే పాత్రకే గవర్నర్ పరిమితం కావాలని దిశానిర్దేశం చేసింది. వీటిని ఎంతవరకు గవర్నర్లు పాటిస్తారో అనుమానమే.



భార్యభర్తలు గొడవపడుతూ..

**భర్త:** నువ్వంటే నాకేమన్న భయమనుకున్నావా? (కోపంగా)

**భార్య:** అబద్ధాలు చెప్పకండి. మీరు నన్ను చూడ్డానికి ఐదుగురితో వచ్చారు. తర్వాత తాంబూలానికి 50 మందితో వచ్చారు. పెళ్లికి 200 మందితోవచ్చారు. మరి నేను మీ ఇంటికి ఒక్కదాన్నే వచ్చాను.

## లక్షణ్‌పురిగా మారనున్న లక్నో ?

**బీజేపీ ప్రతిపాదన**




**లక్నో :** లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో హిందూ ఓటర్లను ఆకట్టుకునేందుకు బీజేపీ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో లక్ష్మణుడు విగ్రహం ఏర్పాటు చేయాలని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం భావిస్తోంది. బీజేపీ ఎమ్మెల్యేలు రామకృష్ణా యాదవ్, రాజ్‌నీష్ గుప్తాలు లక్నోలో లక్ష్మణుడి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదన చేశారు. లక్నోలోని చారిత్రాత్మక తేలి వాలీ మసీద్‌కు ఎదురుగా విగ్రహ నిర్మాణం జరగాలని కోరారు. దీనిపై ముస్లిం సామాజిక వర్గం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. మసీద్‌కు ఎదురుగా లక్ష్మణుకి విగ్రహం నిర్మిస్తే రాష్ట్రంలో మత కల్లోలాలు సంభవించే అవకాశం ఉందని, తాము ప్రశాంతంగా నమాజ్ కూడా చేసుకోలుమని మసీద్ ఇమామ్ మోలానా ఫజీల్ తెలిపారు. విగ్రహ ఏర్పాటు సంబంధించి పూర్తి వివరాలను రానున్న అసెంబ్లీ సమావేశంలో ప్రవేశపెట్టనున్నట్లు బీజేపీ నేతలు వెల్లడించారు. యూపీలో రామ్-లక్ష్మణులకు ఘనమైన చరిత్ర ఉందని, అది భవిష్యత్తు తరాలకు గుర్తుండే విధంగా భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. లక్నో పేరును లక్ష్మణ్‌పూరిగా మార్చాలని ప్రభుత్వాన్ని కొరినట్లు రామకృష్ణా యాదవ్ వెల్లడించారు.



మదాపూర్ లోని మీలాంజ్ టవర్ లోని ఓ ప్రైవేట్ సాఫ్ట్ వేర్ కంపెనీ.. ఎప్పటిలాగానే జూన్ 29న ఆఫీసుకు వచ్చిన సాఫ్ట్ వేర్ ఇంజినీర్ శ్రావణి 9వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. చిత్తూరు జిల్లాకు చెందిన శ్రావణి మదీనాగూడలో భర్తతో కలిసి ఉంటుంది. ఈమెకు ఓ కొడుకు కూడా.. మానసిక ఒత్తిడియే ఆమె మరణానికి కారణంగా పోలీసులు - కుటుంబసభ్యులు తేల్చారు. శ్రావణి ఒక్కదానిదే ఈ సమస్య కాదు.. ప్రస్తుతం హైదరాబాద్ - బెంగళూరు సహా దేశంలోని అన్ని ప్రాంతాల్లో జాబు చేస్తున్న సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు పని ఒత్తిడి తట్టుకోలేక నెలకు కనీసం ఐదుగురు అయినా ఆత్మహత్య చేసుకుంటున్నారని తాజా సర్వేలో తేలింది.. సాఫ్ట్ వేర్ల మరణ మృందంగానికి పని ఒత్తిడి - లక్ష్యాలు చేరకపోవడం..కాలంతో పరుగులు తీయకపోవడమే కారణమని తెలిసింది.

ఒకప్పుడు నెలకు లక్ష జీతం ఇస్తున్న సాఫ్ట్ వేర్ కొలువుల కోసం అందరూ ఎగబడేవారు. కానీ ఇప్పుడు సాఫ్ట్ వేర్ కొలువులు చేయలేక పల్లెలకు పోయి వ్యవసాయం చేసుకుంటున్నారు. చాలా మంది ఇంత ఒత్తిడి భరించలేమని తప్పుకుంటున్నారు. ఇది ఇక్కడే కాదు.. అమెరికాలోనూ ఇలాంటి పరిస్థితి ఉంది.

ట్రంప్ ప్రభుత్వం అమెరికన్లకే ఉద్యోగాలు ఇవ్వాలంటూ కఠిన నిబంధనలు పెట్టడంతో భారతీయ - విదేశీ - అమెరికన్ కంపెనీలన్నీ అమెరికాలో చదువుతున్న ఫైనల్ ఇయర్ ఇంజనీరింగ్ విద్యార్థులను ఎంపిక చేసి 6 నెలలు శిక్షణ ఇస్తున్నాయట.. ఆ తర్వాత జాబ్ లోకి తీసుకుంటే ఏడాది పనిచేయకుండా రిజైన్ చేసి వెళ్లిపోతున్నారు. ఇంతటి ఒత్తిడి తాము తట్టుకోలేమంటూ ఉద్యోగాలు వదిలేస్తుండడంతో అమెరికాలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ల కొరత ఇప్పుడు వెంటాడుతోంది.

ఇండియాలో మన వాళ్లు ఒత్తిడికి తలొగ్గి పనులు చేస్తున్నా వారి సంసార - వ్యక్తిగత జీవితాలు మాత్రం ఈ జాబ్ తో చెల్లాచెదురవుతున్నాయి. పని ఒత్తిడితో కుటుంబాల్లో గొడవలు పెట్టుకోవడం.. సంసారాలను పట్టించుకోకపోవడంతో చాలామంది ఐటీ నిపుణుల జీవితాలు నాశనమవుతున్నాయని సర్వేలో తేలింది. ఇంత ఒత్తిడి మధ్య పనిచేయలేక చాలా మంది 40 ఏళ్లుకాగానే సంపాదించిన దాంతో గ్రామాలకు వచ్చేసి వ్యవసాయం లేదా ఏదైనా వినూత్న పరిశ్రమను పెట్టుకొని ప్రత్యామ్నాయ ఉపాధిని పొందుతున్నారు. ఇప్పుడీ ఒరవడి సాఫ్ట్ వేర్ పరిశ్రమలో చోటుచేసుకుంది.

లక్షల జీతాల కన్నా.. లక్షణమైన జీవితం చాలనే భావన ప్రస్తుతం సాఫ్ట్ వేర్ ఇంజనీర్లలో నెలకొంది. ఇంత ఒత్తిడి మధ్య పనిచేయలేని చాలా మంది తనువు చాలిస్తుండగా.. కొందరు మాత్రం ఆర్థిక ఇబ్బందులు - కుటుంబ పోషణ కోసం చేస్తున్నారు. కానీ ఈ రాత్రి - పగలు తేడా లేని కొలువుల వల్ల తమ వ్యక్తి గత జీవితాలను కోల్పోతున్నారు. ఇటు కుటుంబ జీవితాన్ని.. అటు హైఎండ్ పని ఒత్తిడి తట్టుకోలేక చాలా మంది నరకయాతన పడుతున్నారు. అందుకే 10 ఏళ్ల కంటే ఎక్కువ కాలం ఎవ్వరూ చేయడానికి ఇష్టపడడం లేదని తాజా సర్వే ఒకటి తేల్చింది.

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన కట్ట శ్రీనివాస్ హైదరాబాద్ లో ఎంబీఏ చదివి ముంబైలోని సాఫ్ట్ వేర్ కంపెనీలో పెద్ద ఉద్యోగం సంపాదించాడు. మంచి ఉద్యోగమే అయినా ఆ ఒత్తిడి తట్టుకోలేక నిత్యం నరకం అనుభవించాడు. ముంబైలో లక్షలు వస్తున్నా కూడా వదిలేసి వ్యవసాయం చేసేందుకు సొంతూరుకు వచ్చాడు. ఇక్కడకు రాగానే అధునాతన సాగు పద్ధతులను అన్వేషించాడు. దక్షిణ కొరియా లో చేస్తున్న చౌహన్ క్యూ పద్ధతి వ్యవసాయం అతడిని ఆకర్షించింది. వాటిని ఇక్కడ అమలు చేసి కూరగాయలు సాగు చేసి కార్పొరేట్ కంపెనీలకు మందులు వాడని కూరగాయలు అమ్ముతూ లాభాల పంట పండిస్తున్నాడు.

కరీంనగర్ పూర్వపు జిల్లాలోని గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామానికి చెందిన సాగర్ రెడ్డి అనే యువకుడు ఇటీవల లక్షల రూపాయల జీతం ఇచ్చే సాఫ్ట్ వేర్ ఇంజినీర్ జాబును వదిలి సొంతూరుకు వచ్చి కుందేళ్ల సాగును చేపట్టాడు. రాజస్థాన్ వెళ్లి అక్కడ కుందేళ్ల ఫామ్ ను చూసి లాభసాటి అని తెలుసుకొని 100 న్యూజిలాండ్ - ఇంగ్లండ్ - తదితర దేశాల మేలు జాతి కుందేళ్లతో వ్యాపారం ప్రారంభించాడు. ప్రస్తుతం అవి 900 కుందేళ్లకు చేరాయి. నెలకు 50 నుంచి 60వేల సంపాదన వస్తోంది. ఇలా ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. ఇప్పుడు సాఫ్ట్ వేర్ కొలువు బంగారం కాదు.. అదో భారంగా మారింది. మానసికంగా కుదేలు చేస్తున్న ఆ నౌకరిని వదిలి సొంత వ్యాపారాలు - వ్యవసాయం వైపు యువ ఇంజనీర్లు అడుగులు వేస్తున్నారు. పని ఒత్తిడి లేని స్వయం ఉపాధి వైపు దృష్టిసారిస్తున్నారు. సాఫ్ట్ వేర్ రంగంలో వస్తున్న ఈ నయా మార్పు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

– ఖాన్








రాజధాని ప్రాంతం రాయపూడి ప్రగతినగర్ లో ఎన్టీఆర్ గృహాన్ని ప్రారంభిస్తున్న గ్రామ సర్పంచి రెంటపల్లి నాగమణేమ్మ, పంచాయతీ కార్యదర్శి గాదె వెంకటప్పయ్య, తదితరులు

## చంద్రబాబు మళ్లీ సింగపూర్ పర్యటన

**8,9,10 తేదీల్లో జరిగే ప్రపంచ నగరాల సదస్సుకు హాజరు**



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సింగపూర్ పర్యటనకు వెళ్లారు. ఈనెల 8, 9, 10 తేదీల్లో ఆయన సింగపూర్‌లో పర్యటిస్తారు. సింగపూర్‌లో జరిగే ప్రపంచ నగరాల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారు. వరుసగా రెండు రోజులు ఆ సదస్సులో కొన్ని ముఖ్యమైన సమావేశాలు, బృంద చర్చల్లో పాల్గొంటారు. పట్టణ, నగరీకరణకు సంబంధించిన అంశాలపై కీలక ప్రసంగాలు చేయనున్నారు. గత విదేశీ పర్యటనల మాదిరే వివిధ దేశాలకు చెందిన పలువురు వాణిజ్య, పారిశ్రామిక ప్రముఖులతో ద్వైపాక్షిక సమావేశాలు జరుపుతారు. వివిధ దేశాలకు చెందిన రాజకీయ ప్రముఖులు, ప్రభుత్వాధినేతలతో భేటీ కానున్నారు. ఇటీవల సింగపూర్ బృందం ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చిన సందర్భంలో ఆ దేశ కమ్యూనికేషన్ల మంత్రి ఈశ్వరన్ మేయర్ల సదస్సులో పాల్గొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబుని ప్రత్యేకంగా ఆహ్వానించారు. 8వ తేదీన ప్రారంభమయ్యే 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో తొలుత జరగనున్న మేయర్స్. ఫోరమ్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటున్నారు. 'సాంకేతికతతో సమ్మిళిత వృద్ధి', 'రాష్ట్ర, నగర స్థాయి పాలనలో సమన్వయం' తదితర అంశాలపై చంద్రబాబు ప్రసంగిస్తారు. అదేరోజు సాయంత్రం వివిధ దేశాల మేయర్లు, ప్రతినిధులతో జరిగే విందులో పాల్గొంటారు. ఆ సందర్భంలోనే వివిధ సంస్థల ప్రతినిధులతో ఆయన ద్వైపాక్షిక సమావేశాల్లో పాల్గొంటారు. 9వ తేదీన జరిగే పీనరీ సెషన్‌లో నగరీకరణకు సంబంధించిన అంశాలపై జరిపే చర్చల్లో పాల్గొంటారు.

## రాజీవ్ గాంధీ హోల్‌సేల్ మార్కెట్ తరలింపు

**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** నగరంలో రాజీవ్‌గాంధీ హోల్‌సేల్ మార్కెట్, పూల మార్కెట్‌లు వేరే ప్రాంతాలకు తరలించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.నివాస్ తెలిపారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో తన చాంబర్‌లో హోల్‌సేల్ మార్కెట్ వ్యాపారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ మార్కెట్ తరలింపునకు సహకరించాలని కోరారు. విజయవాడ అమరావతి గేట్‌వే ప్రాజెక్ట్ కింద ప్రకాశం బ్యారేజ్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఉన్న ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నామని వివరించారు. దీని దృష్ట్యా హోల్‌సేల్ మార్కెట్‌లను వేరే ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు.

# కృష్ణాపై 12 వారధులు

- అన్నీ అమరావతికి అనుసంధానం
- వైకుంఠపురం వద్ద ఐకానిక్ వారధి
- రాజధాని అభివృద్ధి పనులను సమీక్షించిన సీఎం



**రాజధాని ప్రతినిధి,అమరావతి :** వైకుంఠపురం దగ్గర కృష్ణానదిపై రిజిర్వాయర్‌ను నిర్మించనున్న వారధిని ఐకానిక్ నిర్మాణంగా చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిని అమరావతికి అనుసంధానం చేస్తూ కృష్ణానదిపై నిర్మించే డజనుకు పైగా వారధులన్నీ రాజధానికే మకుటాయమానంగా నిలవాలని ఆయన స్పష్టంచేశారు. రాజధానిలో చేపట్టిన రహదారుల నిర్మాణాలు డిసెంబరు నేలాఖరులోగా పూర్తి చేయాలని చెప్పారు. మధ్యాహ్నం సచివాలయంలో సీఆర్‌డీఏ 17వ అథారిటీ సమావేశంలో ముఖ్యమంత్రి రాజధాని అభివృద్ధి పనులను సమీక్షించారు. సీడ్ యాక్సెస్ రహదారి, సబ్ ఆర్టియల్ రహదారుల నిర్మాణాలలో జాప్యానికి గల కారణాలకు అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఒక్కొక్క రహదారికి 150కి పైగా యుటిలిటీ క్రాసింగ్స్ వున్నాయని, వాటి నిర్మాణాలను పూర్తి చేస్తే కానీ, రహదారుల నిర్మాణాలను పూర్తి చేయలేమని అమరావతి అభివృద్ధి సంస్థ సీఎండీ లక్ష్మీ పార్థసారథి ముఖ్యమంత్రికి వివరించారు. రాజధాని పరిధిలోని కొన్ని గ్రామాలలో భూసేకరణ ప్రక్రియ పూర్తి కాకపోవడం రహదారుల నిర్మాణాలకు ప్రధాన అడ్డంకిగా మారిందని చేప్పారు. సీడ్ యాక్సెస్ రహదారి నిర్మాణంలో 63శాతం పని పూర్తయిందని, రూ.140.60 కోట్ల మేర నిధులను ఖర్చు పెట్టామని తెలిపారు. ఇప్పటి వరకు వీజీటీఎం ఉడా పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులను పీఆర్‌డీఏ పరిధిలో పనిచేస్తున్న ప్రతిపాదనపై సమావేశంలో చర్చించారు. ప్లానింగ్, ఇంజినీరింగ్, అడ్మినిస్ట్రేషన్, క్లాస్ 4 ఉద్యోగులను మొత్తం నాలుగు కుటగిరిలలో తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు.


**పవిత్ర సంగయం వద్ద టీటీడీ ఆలయం**

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో అమరావతి పరిధిలో గల కృష్ణానదీతీరంలో శ్రీ వేంకటేశ్వరుని ఆలయ నిర్మాణం చేపట్టాలన్న ప్రతిపాదనపై సమావేశంలో చర్చించారు. పవిత్ర సంగమ ప్రాంతంలో ఇప్పటికే దీనికి అనుకూలంగా ఉండే స్థలాన్ని గుర్తించారు. టీటీడీ ఈ ఆలయ నిర్మాణాన్ని చేపట్టనుంది. రాజధానిలో సొంత ఇళ్లను కొనుగోలు చేయాలనుకునే ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ కాంట్రాక్టు ఉద్యోగులు, హైకోర్టు న్యాయవాదులు, ఇతర వర్గాల నుంచి వస్తున్న డిమాండును దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతానికి వెయ్యి గృహాలను వాణిజ్యపరంగా నిర్మించడం కోసం రూపొందించిన ప్రతిపాదనలపై సమావేశంలో చర్చించారు. 1285, 1580 1880, 2150 చదరపు అడుగుల విస్తీర్ణంలో వీటిని నిర్మిస్తారు. చదరపు అడుగుకు రూ.3 వేల ధరను ప్రాథమికంగా నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.500 కోట్ల వ్యయం కాగలదని అంచనా వేశారు. రాజధానిలో డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నామని, ఇటువంటి వ్యవస్థ దేశంలో ఇదే ప్రథమమని సీఆర్‌డీఏ కమిషనర్ చెప్పారు. అమరావతిలో విద్యాలయాలను నెలకొల్పడానికి 8 ప్రఖ్యాత సంస్థలు ముందుకొచ్చాయని చెప్పారు. ఇవిగాక సెయింట్ గేబ్రియల్, ఫ్యూచరిస్టిక్ ఎడ్యూకేషన్ సొసైటీ,పీహెచ్ఆర్ ఇన్వెంట్ ఎడ్యూకేషనల్ సొసైటీ, జూబిలీహిల్స్ ఎడ్యూకేషన్, సొసైటీ ఆఫ్ సెయింట్ మేరీ,ఎన్ఎస్ఎం కూడా దరఖాస్తు చేశాయని తెలిపారు.కొన్ని సార్ట్ హోటళ్లు ముందుకొస్తున్నాయని ఫైవ్ స్టార్ హోటల్ ఒకటి రాజధానిలో త్వరలో నిర్మాణం చేపట్టనున్నాయని చెప్పారు.శాఖమూరులో 7.5 ఎకరాల విస్తీర్ణంలో శిల్పారాయం తరహాలో ఏర్పాటు చేయనున్న ఎత్నిక్ విలేజ్‌లో ఎకరం స్థలంలో క్రాఫ్ట్ బజారును ఏర్పాటు చేయడానికి ఆంధ్రప్రదేశ్ క్రాఫ్ట్ కౌన్సిల్ ముందుకొచ్చింది.దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఏపీ క్రాఫ్ట్ కౌన్సిల్ ప్రతినిధులు ముఖ్యమంత్రి ముందుంచారు.

**దొనకొండలో నిర్మాణ నగరం**

దొనకొండలో నిర్మాణ వస్తు నగరం ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రకటించారు.సింగపూర్ భాగస్వామ్యంతో దీన్ని చేపట్టాలని భావిస్తున్నట్లు తెలిపారు.చైనాలో ఈ తరహా నగరం ఉందని, నిర్మాణాలకు సంబంధించిన సమస్త వస్తు సామాగ్రి ఇక్కడ లభ్యం అవుతుందని చెప్పారు. నిర్మాణరంగ అవసరాలకు సంబంధించిన తయారీ యూనిట్లు, ఆధునిక సాంకేతిక సరఫరాదారులు, తయారీదారులిద్దరికీ ఈ నగరం ఉపయుక్తంగా ఉంటుదన్నారు.కేవలం నిర్మాణం సామాగ్రి, తయారీ పరిశ్రమలే కాకుండా, నిర్మాణ రంగంలో చోటు చేసుకుంటున్న అనేకానేకి మార్పులు, నవ్యావిష్కరణలకు కేంద్రంగా,సాంకేతిక వైజ్ఞానిక కేంద్రంగా వుంటుదన్నారు.

దీనికి సింగపూర్ వంటి దేశాల సహకారం అవసరమన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. తొలత 61.77 ఎకరాలలోట్రేడ్ సెంటర్‌గా దీన్ని నెలకొల్పుతామని, ఇప్పటికే 610 సంస్థలు ఇక్కడ వ్యాపార కార్యకలాపాలను ఆరంభించడానికి ముందుకొచ్చాయని టిడ్కో ఎగ్జిక్యూటీవ్ వైస్ చైర్మన్ రామనాథ్ ముఖ్యమంత్రికి వివరించారు. కార్పొరేట్ కార్యాలయాలు, మూడంచెల ప్రదర్శనశాలలు, గిడ్డంగులు, గోడౌన్లు, భారీ నిర్మాణ యంత్రి పరికరాలు, ఫుడ్ ప్లాజా, పార్కింగ్ సదుపాయాలతో దీనిని త్వరలో ఏర్పాటుచేస్తామని రామనాథ్ తెలిపారు.



# ప్రజల సొమ్ము ప్రకటనల పాలు...

ప్రజాధనాన్ని దినోత్సవాల పేరిట అప్పనంగా ఖర్చుపెట్టే అధికార రాజకీయ నాయకులకు మనదేశంలో కొదవులేదు. సాక్షాత్తూ ప్రధాని మోడీ యోగా దినోత్సవం పేరుతో రూ. 35లక్షలు ఒక్కరోజులో ఊదేశారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో ప్రధాని మోడీ.. తన ట్విట్టర్ అకౌంట్ లో ఓ వీడియోను షేర్ చేశారు. నాడీ శోధన్ ప్రాణాయామానికి సంబంధించిన ఈ త్రీడీ వీడియోను అనులోమ విలోమ పద్ధతులో చేసే ఈ ప్రాణాయామం గురించి దీనిలో వివరిస్తారు. ప్రతి రోజూ ఈ ప్రాణాయామ యోగాను చేయడం వల్ల జీవితం ప్రశాంతంగా ఉంటుందని పాజిటివ్ శక్తి వస్తుందని ట్వీట్‌లో మోడీ చెప్పారు. ప్రాణాయామ యోగాను ఎలా చేయాలన్న అంశాన్ని 3 నిమిషాల వీడియోలో సమగ్రంగా వివరించారు. సుఖాసనంలో చేసే ఈ యోగా వల్ల కలిగే లాభాలను కూడా ఆ వీడియోలో వివరించారు.

ప్రధాని మోడీ చేసిన యోగాసనాల వీడియో - ఫోటో షూట్ కోసం రూ. 35 లక్షలు ఖర్చయినట్లు పీఎంఓ లెక్క తేల్చింది. ఇక ప్రధానిని తలపించేలా రూపొందించిన యానిమేటెడ్ కార్టూన్ యోగా వీడియోల కోసం ప్రైవేట్ సంస్థకు రూ. 40-45 లక్షలు ఖర్చు పెట్టారని - కాదు కాదు.. రూ.75-80 లక్షల దాకా వెచ్చించారని మీడియాలో వార్తలు వెలువడ్డాయి. మరోవైపు యోగా డే ప్రమోషన్ కోసం దేశ ప్రజల మొబైల్ ఫోన్లకు పంపిన ఎస్ ఎంఎస్ ల ఖర్చు రూ. 15 కోట్ల 87 లక్షలని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇక.. సైన్ బోర్డులు - టీవీ యాడ్స్ - పేపర్ ప్రకటనలు.. అవీఇవీ కలిపి మొత్తం ఆ ఒక్క రోజు సంబరం కోసమే రూ. 20 కోట్లు ఖర్చు అయిందని కేంద్రం క్లారిటీ ఇచ్చింది.

ఇన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేయడంపై వివాదం రేగింది. యోగా దినోత్సవం సందర్భంగా ప్రకటనల కోసం రూ.20 కోట్లు పెట్టారని కాంగ్రెస్ నేత శశిథరూర్ విమర్శించారు. మోడీ యోగా వీడియోల కోసం రూ.35 లక్షలు ఖర్చుపెట్టడం ఏంటని నిలదీశారు. పైగా థర్డ్ పార్టీ రూపంలో - వివరాలు వెల్లడించలేని వ్యక్తుల ఆధ్వర్యంలో నిధులు ఖర్చు చేయడం వల్ల అవినీతి జరిగే అవకాశం ఉంటుందని ఆరోపించారు. కాంగ్రెస్ నేత విమర్శల పట్ల సమాచార ప్రసార శాఖ మంత్రి రాజ్యవర్ధన్ రాథోడ్ స్పందించారు. మోడీ ఫిట్ నెస్ వీడియోను ప్రధాని కార్యాలయ వీడియోగ్రాఫర్ చిత్రీకరించారని తెలిపిన రాథోడ్.. డబ్బు ఖర్చు పెట్టారని వచ్చిన వార్తలు తప్పుడు కథనాలన్నారు. మోడీ ఫిట్ నెస్ వీడియోల కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని ఆయన సమాధానం ఇవ్వడం ట్విస్ట్.




# ఉద్యోగులంటే ఎంత చులకనో..

ఆమె



మన దేశంలో ప్రజాస్వామ్యం పాలకులకే తప్ప ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడదని ఉత్తరాఖండ్ టీచర్ ఉత్తరా బహుగుణ (57) విషయంలో మరొకసారి నిజమైంది. 25 ఏళ్లుగా మారుమూల పల్లెలో ప్రాథమిక స్కూలు ప్రిన్సిపల్‌గా చేస్తున్న ఆమె తన ట్రాన్స్‌ఫర్ కోసం సీఎం త్రివేంద్ర సింగ్ రావత్ వద్దకు వెళ్లింది. ఆయన ఆవిషయాలు జనతాదర్బార్‌లో కాదు, అధికారులతో చెప్పుకో అన్నారు. అప్పటికే అనేక మార్లు తిరిగిన ఆమె అదికాదు అంటూ ఏదో చెప్పబోయేలోగా ఆయన మండిపడ్డారు. దీంతో ఆమెకూడా వాగ్వుద్ధానికి దిగింది. ఆమెను కస్టడీలోకి తీసుకొని సస్పెండు చేయండి అంటూ హుంకరించారు. ఇది దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. నిజానికి ఆమె పరిస్థితి పూర్తిగా తెలుసుకొని మానవత్వం తో వ్యవహరించి ఉంటే బాగుండేది. అనేక ఏళ్లుగా విసిగి వేసారిన ఆమెను ఆయన మాటలతో వేధించారని చెప్పకతప్పదు. ఇద్దరు పిల్లలు డెహ్రాడూన్ చదువుతున్నారు. గత 25 ఏళ్లుగా మరుమూల పల్లెల్లోనే ఉద్యోగం చేశాను. మూడేళ్ల క్రిందట భర్తమరణంతో పిల్లలను చూసుకునే వారు లేరు. అందువల్ల దయ ఉంచి ట్రాన్స్‌ఫర్ చేయండి అని పదవీవిరమణకు దగ్గర్లో ఉన్న ఆమె అడగడమే పాపమా ? చాలా మంది అంటుంటారు.. ఎక్కడ ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారో అక్కడే ఉండొచ్చుకదా అని అంటారు. అయితే ప్రభుత్వాలు పల్లెలను పట్టించుకోవు. అక్కడ రవాణా సౌకర్యాలు, ఉన్నత విద్య, వైద్యసదుపాయాలు ఉండవు. దీంతో ఉద్యోగులు అక్కడ ఉండటానికి ఇష్టపడరు. పాలకులు వారికి ఇష్టమైన చోట వారికిష్టమైన వారికి కాంట్రాక్టులు కట్టబెట్టి అభివృద్ధి, విస్తరణల పేరుతో నగరాలకే ప్రాధాన్యత ఇస్తుంటారు. ఇదంతా ఒక మాయాలోకం.. ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు తీవ్రంగా విఫలం చెందడంతో తలెత్తే పరిణామాలే ఇవని గుర్తించాలి. ఇలాంటి పరిస్థితులే డాక్టర్లకు, పాలనా అధికారులకు కూడా తరచుగా ఎదురవుతుంటాయి.

బహుగుణ అరెస్టు, బెయిలు విడుదలపై

### మహిళా టీచర్‌పై సీఎం మండిపాటు

పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి భూపేందర్ కౌర్ మాట్లాడుతూ ఆమె మర్యాదగా వ్యవహరించనందువల్లే ఆమెను అరెస్టు చేశామని, ఈమెకన్నా ముందు ఇదేపరిస్థితుల్లో మరో 58 మంది ఉన్నందున ఆమె బదిలీ కష్టమని, వంతుల వారీగా మాత్రమే బదిలీలు జరుగుతాయని ఆమె తేల్చిచెప్పారు. ఆమె అనేక ఏళ్లు సుదీర్ఘ సెలవుల్లో ఉన్నారని, అందువల్లే ఆమెకు మారుమూల పల్లెల్లో ఉద్యోగాలు వేయడానికి కూడా కారణం ఒకటన్నారు.అయితే భర్త అనారోగ్యం వల్లే సెలవులు పెట్టాల్సి వచ్చిందని బహుగుణ వివరిస్తున్నారు.
దీనిపై మాజీ ముఖ్యమంత్రి హరీష్ రావత్ మాట్లాడుతూ ప్రభుత్వం సున్నితత్వాన్ని కోల్పోయిందని ఒక వితంతువుపై ఆ విధంగా ప్రవర్తించి ఉండకూడదన్నారు.
ప్రజాస్వామ్యంలో ప్రతి పనికి నియమనిబంధనలు ఉంటాయి. అయితే విపరీతమైన రాజకీయ జోక్యం వల్ల కొంతమంది సులువుగా కావాల్సింది పొందుతుంటే మరికొందరు బహుగుణలా మిగిలి పోతున్నారు. కొంతమంది ఎమ్మెల్యేలు, విద్యామంత్రులు, అధికారులు టీచర్ల బదిలీలకు లంచాలు తీసుకుంటున్నారని టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీచర్ల యూనియన్‌ల్లో చురుకుగా ఉండకపోవడం వల్ల కూడా ఇలాంటి పరిస్థితి తలెత్తుతుందని వారు చెబుతున్నారు.

### బిగ్ బాస్ ఆఫర్

సదరు ఉపాధ్యాయురాలు ఉత్తరాపంత్ కు ఊహించని రీతిలో బిగ్ బాస్ హిందీ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. ఆమెను షోలో పాల్గొనే ఇంట్రస్ట్ ఉందా? అని అడిగినట్లు చెబుతున్నారు. అయితే.. తనకు షోలో పాల్గొనేందుకు ఆసక్తి లేదంటూ ఆమె రిజెక్ట్ చేశారు. కుటుంబ బాధ్యతల రీత్యా షోలో పాల్గొనటం లేదని ఆమె కుమారుడు వెల్లడించారు. అంతేకాదు.. ఆమెతో మాట్లాడేందుకు ప్రముఖ న్యాయవాది రామ్ జఠ్మలానీ తో సహా పలువురు ప్రముఖుల నుంచి ఫోన్లు వస్తున్న విషయం బయటకు వచ్చింది. దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న తన బదిలీ గురించి మాట్లాడేందుకు ముఖ్యమంత్రి రావత్ ను కలిసిన టీచరమ్మ.. మాటలు కాస్తా వాగ్వాదంగా మారటం.. ఆగ్రహం చెందిన సీఎం ఆమెను సస్పెండ్ చేయటం తెలిసిందే. అంతేకాదు.. సీఎం విధులకు ఆటంకం కలిగించారంటూ ఆమెను అరెస్ట్ చేయాలని ఆదేశించారు కూడా. ఈ వ్యవహారంతో ఆమెకు విపక్షాల నుంచి మద్దతు లభించటంతో పాటు.. ప్రముఖురాలిగా మారిపోయారు.

## కాలమ్

**సిటిజన్ :** సర్.. ఏంటి సర్ ఇదంతా..?
**బత్తాయి :** విదేశీ సంస్కృతిపై యుద్ధం. మన సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి.
**సిటిజన్ :** అవునా సర్. అయితే, ఏం చేయాలి సర్..?
**బత్తాయి :** లవర్స్ డేలు, ప్రేమికుల దినోత్సవాలు, ఆ దినాలు, ఈ దినాలు మనదేశంలో పుట్టలేదు. కాబట్టి వాటిని నిషేధించాలి.
**సిటిజన్ :** ఇంకా సర్..?
**బత్తాయి :** అసలు విదేశీ నీడ కూడా ఈ దేశంలో పడొద్దు. మనం అంతా పోరాడాలి.
**సిటిజన్ :** తప్పకుండా సర్. మీరేం చేస్తుంటారు? మీ పిల్లలు..?
**బత్తాయి :** నేను రాజకీయాలు. ఇద్దరు పిల్లలు. ఒకడు అమెరికాలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్, ఇంకోడు లండన్ లో డాక్టర్.
**సిటిజన్ :** ఆహా.. డాలర్లు బాగానే సంపాదిస్తున్నారన్నమాట.
**బత్తాయి :** పర్వాలేదు. ఇంటి అవసరాలన్నీ వాళ్లే చూసుకుంటారు.
**సిటిజన్ :** ఏరా పుచ్చిపోయిన చచ్చు బత్తాయిగా..?
**బత్తాయి :** ఏయ్.. ఏంటి నన్నే..?
**సిటిజన్ :** అవున్రా.. పాచిపోయిన పుల్కా. నీ కొడుకులు విదేశాల్లో ఉద్యోగాలు చేయొచ్చు. ఆ దేశాల డాలర్లు నువ్వు ఇండియాకు దిగుమతి చేసుకోవచ్చు. లవర్స్ డే, ఫాదర్స్ డే వంటివి మాత్రం విదేశీ సంస్కృతి. వాటిని జరుపుకోవద్దు. ఒరేయ్ సోంబేరి.. నీ ఫోన్ చూపించు. రెడ్ మీ. ఇది ఏ దేశం తయారు చేస్తుందో తెల్సారా? చైనా. నాది సాంసంగ్. దీన్ని సౌత్ కొరియా. నువ్వు చూసే టీవీ ఏ దేశం కనిపెట్టిందో తెలుసునారా? నువ్వు వాడే ఇంటర్నెట్..? ఎక్కే రైలు, విమానం, ఆఖరికి నీ బత్తాయి గ్యాంగ్ వేసుకునే జీన్స్ ప్యాంట్ కూడా పరాయి దేశపోడు తయారు చేసిందేరా. నువ్వు, నీ పిల్లలు తినే తిండిలో సగం విదేశాలవేరా. చివరకు.. నువ్వు మాట్లాడే, ఈ దేశం అన్నింటా వాడుతున్న ఇంగ్లీష్ మన భాషనారా..? మన దేశాన్ని నాశనం చేసిన తెల్లోడిది. ముందు దాన్ని తరమాలని చెప్పురా దమ్ముంటే.
**బత్తాయి :** ఇదిగో.. భాష వేరు. సంస్కృతి వేరు.
**రెండో బత్తాయి :** అన్నా నువ్ సూపర్.
**సిటిజన్ :** నువ్వెవడ్రా..? నీకేం అర్థమైందని వాన్ని సూపర్ అంటున్నవ్ రా..?
**రెండో బత్తాయి :** మా అన్న ఏం చెప్తే.. అదే రైట్.
**సిటిజన్ :** ఒరే హాఫ్ బ్రెయిన్ వెధవల్లార ఇలా సగం సగం తెల్సుకొని మాట్లాడకండి. మొదట భాష పుట్టిన తర్వాతే సంస్కృతులు ఏర్పడ్డాయి. తెలుగు సంస్కృతి అనేది దేనితో వచ్చిందిరా? భాషతో కాదా..? అలాగే తమిళం..? అన్ని సంస్కృతులు కూడా ఇలాగే వచ్చాయి. దీనికి ఇంగ్లీష్ కూడా మినహాయింపు కాదు. ఇవాళ ఇంగ్లీష్ ను తప్పించుకోలేరు కాబట్టి, అది లేకుంటే ఉద్యోగాలు చేయలేరు కాబట్టి, దానికి మినహాయింపులు ఇచ్చారా సన్నాసుల్లారా.? ఇదిరా మీ చిత్తశుద్ధి.
**బత్తాయిలు :** ఒరేయ్.. అన్నలూ, తమ్ముళ్లూ వీడెవడో దేశద్రోహి, దేశాన్ని తిడుతున్నాడు రండ్రా..
**సిటిజన్ :** నేను దేశాన్ని తిట్టానా ???.. ??.. ????

# నిఫా వైరస్ గుట్టు రట్టు..

నిఫా వైరస్ మిస్టరీ వీడింది. గబ్బిలాలు తిన్న పండ్లను మనుషులు తినడం వల్లనే ఈ వ్యాధి వ్యాపించిందని పరిశోధనలో నిరూపితమైంది. కేరళ రాష్ట్రంలో వ్యాపించి 17మంది మృతికి కారణమైన ఈ వైరస్ ఎలా వ్యాపించిందనే విషయాన్ని భారత వైద్య పరిశోధన సమాఖ్య (ఐఎంసీఆర్) తేల్చింది. కేరళ రాష్ట్రంలోని కోజికోడ్ - మల్లాపురం జిల్లాలోనే ఎక్కువమంది ఈ వైరస్ వల్ల మృతిచెందారు..ఈ మరణాలు ఉధృతమయ్యాయక వైద్య పరిశోధన సమాఖ్య కేరళలోని కోజికోడ్ లోని చంగారోత్ గ్రామంలో పర్యటించింది. అక్కడి గబ్బిలాలను పట్టుకొని పరిశోధించింది. ఆ గబ్బిలాల్లో నిఫా వైరస్ ను గుర్తించారు. ఈ వైరస్ సోకిన గబ్బిలాలు తిన్న పండ్లను స్థానికులు తినడం వల్లే ఈ వైరస్ వారికి సోకిందని తాజాగా కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు.
అయితే నిఫా వైరస్ సోకి దాదాపు రెండు నెలలు కావస్తోంది. ఈ వైరస్ కొత్తది కావడం.. పరికరాలు అందుబాటులో లేకపోవడంతో దీన్ని నిర్ధారించేందుకు కాస్త ఎక్కువ సమయం పట్టిందని కేంద్రమంత్రి తెలిపారు. తొలిసారిగా 21 గబ్బిలాలను పట్టుకున్న పరిశోధకులు వాటిని పరిశీలించి వాటిలో నిఫా వైరస్ లేదని తేల్చారు. ఆ తర్వాత రెండో దఫాలో 55 గబ్బిలాలను పట్టుకొని పరిశోధించగా అందులో పండ్లను తినే గబ్బిలాల్లో నిఫా వైరస్ ఉన్నట్టు గుర్తించారు.. తాజాగా



కేరళ రాష్ట్రంలోని కోజికోడ్ మల్లాపురంలో జిల్లాలో నిఫా వైరస్ లేదని.. పూర్తిగా తగ్గిపోయిందని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. జూన్ 1 తరువాత నిఫా వైరస్ కేసులు ఎక్కడా నమోదు కాలేదని ప్రకటన చేసింది.


# రాజధాని క్లాసిఫైడ్స్

## నివాస ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో **500, 1000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ :**9440662699**

**రాయపూడి**
రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామ పరిధిలో **500, 1000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : **9908244333**

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో **500, 1000, 2000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్:**9440662699**

## ఇతరములు

**తుళ్ళూరు**
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ **9440307123**

వెంకటపాలెం
సాయిలాస్య రియల్ఎస్టేట్ & ఫైనాన్స్ కన్సల్టెన్సీ, గాదె నాగేశ్వరరావు
ఫోన్ : **951515393**

**మందడం**
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : **9553023388**

**వెలగపూడి**
సాయి గణేష్ ట్రేడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : **9640811333**

**రాయపూడి**
చంద్రిక ట్రేడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : **9908073516**

**రాయపూడి**
రియల్ఎస్టేట్ క్రయ,విక్రయాలకు సంప్రదించడం న్యూసింగపూర్ రియల్ ఎస్టేట్
ఫోన్ : **9848442436**

**రాయపూడి**
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ **9848021898**

## షాప్స్

**తుళ్ళూరు**
రేమాండ్స్ట్రైలర్స్
ఫోన్ : **9492470426**

**రాయపూడి**
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : **9985853188**

**తుళ్ళూరు**
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : **9848407935**

**తుళ్ళూరు**
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : **9581500500**

**తుళ్ళూరు**
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :**9247171083**

**రాయపూడి**
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : **9603990791**

## హస్పటల్స్

**విజయవాడ**
ఆంధ్ర హస్పటల్, డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : **9177219900**

**విజయవాడ**
ఇంధిరారావు మెడికేర్ (సెంటర్)
ఫోన్ : **9440421580**

**విజయవాడ**
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : **9849122788**

**విజయవాడ**
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి డా॥ రెహమాన్
ఫోన్: **0866-2475087**

**విజయవాడ**
శ్రీమానస సైకియాట్రిక్ డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:**0866-2436647**

**విశాఖపట్నం**
చింతలూరు ఆయుర్వేద డా॥ విశ్వనాథ్
ఫోన్ :**90329 90138**

## వాణిజ్య ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో **500, 1000, 2000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : **9440662699**

**ఐనవోలు**
రాజధాని ప్రాంతంలోని ఐనవోలు గ్రామ పరిధిలో **500, 1000, 2000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : **9908244333**

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో **500, 1000, 2000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : **9440662699**

## విద్యా సంస్థలు

ఐనవోలు
విఐటీ-ఏపీ యూనివర్శిసిటీ
ఫోన్ :**0863 2370444**

నీరుకొండ
ఎస్ఆర్ఎమ్ యూనివర్శిసిటీ
ఫోన్ :**0863 2343000**

**గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.**
**- మేనేజర్**

**ప్రకటనలకు సంప్రదించండి 9493170689**


# భూగర్భజలాల వృద్ధి కోసం ప్రభుత్వ కసరత్తు

**రాజధాని ప్రతినిధి,అమరావతి :** భూగర్భ జలాలు మరింతగా వృద్ధి చేసేందుకు ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంకుడు గుంతలు,నీరు మీరు వంటి కార్యక్రమాలు అమలు చేసి భూగర్భజలాల పెంపుదలపై దృష్టి సారించారు. అలాగే బావులని వినియోగంలోకి తీసుకొచ్చి నీరు నిల్వ చేసేలా చర్యలు చేపట్టి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జలాల తగ్గుదల భవిష్యత్తు ఇబ్బందులు వివరిస్తూ నీటి వృధాను అరికట్టగలిగారు. నీతిఆయోగ్ సైతం రాష్ట్రంలో భూగర్భ జలాలు వృద్ధి చేస్తున్న తీరుపై ప్రశంసల జల్లు కురిపించింది.

**ఇంజక్షన్ బావులు వైపు అడుగులు...**
భూగర్భజలాలు సమృద్ధిగా పెంచేందుకు ప్రభుత్వం నూతన పద్ధతులపై దృష్టి కేంద్రికరించింది. ఇప్పటికే ఈ విధానం గుజరాత్ రాష్ట్రంలో అమలులో ఉండటంతో రాష్ట్రంలో ఈ నూతన ప్రక్రియ ప్రారంభించే యోచనలో సర్కార్ ఉంది.

### ప్రయోగాత్మకంగా ఇంజక్షన్ బావులు

ఎంపిక చేసినా ప్రాంతాల్లో బోర్లు తీసి ఇందులో రంధ్రాలు చేసినా పైపులు అమార్చుతారు. భూమికి సమాంతరంగా కాకుండా కొంచెం లోతులో బావులను ఏర్పాటు చేయడంతో చుట్టూ పక్కల పడిన వర్షపు నీరు మొత్తం వాటిలోకి చేరుతుంది. అలాచేరినా నీరంతా బోరులో ఏర్పాటు చేసినా పైపులోకి వెళ్లి రంధ్రాలు ద్వారా భూమిలోకి వెళుతుంది. వ్యర్థాలు వంటివి ఈ బావులోకి వెళ్లకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ విధానాన్నే ఇంజక్షన్ బావులు అంటారు. అనంతపురం, చిత్తూరు, ప్రకాశం జిల్లాలో ఈ పద్ధతిని అమలు చేసేందుకు కృషి చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఒక్క వర్షపు చుక్కను కూడా వృధా కాకుండా ఇంజక్షన్ బావులని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. సాధారణంగా గ్రామాల చివరకు నీరు చేరి నిలిచిపోయేలా ఏర్పాట్లు ఉంటాయి. అక్కడే ఈ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

**విదేశీ విధానాలపై దృష్టి...**
నివాసాలు, వాణిజ్య,సముదాయాలు, రహదారులలో వర్షపు నీరు ఇంకే విధంగా విదేశాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విధానాలపై అధ్యయనం చేసి రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు ప్రభుత్వం ఆలోచనలు చేస్తోంది. భవిష్యత్‌లో నీటి కొరత రాకుండా ముందస్తు ప్రణాళికలు అమలు చేయనుంది.

# డొంక కదిలింది

- దూకుడు పెంచిన సీఐడీ
- వెలుగులోకి కొత్త లింకులు
- బయటపడుతున్న ఉన్నతాధికారుల సంబంధాలు
- కదులుతున్న పీఠాలు
- పెద్దల అరెస్టుకు రంగం సిద్ధం

**హైదరాబాద్ :** సంచలనం రేకెత్తించిన ఎంసెట్ ప్రశ్నాపత్రం లీకేజి కేసు కొత్త మలుపు తిరుగుతోంది. తీగలాగితే డొంక కదిలినట్లుగా ఒక్కొక్కరి గుట్టు రట్టవుతుంది. లీకేజీ వ్యవహారంతో నేరుగా ఉన్నతాధికారులకే సంబందాలున్నటు తెలుస్తోంది. కేసును ఛేదించేందుకు దూకుడు పెంచిన సీఐడీ ఒక్కొక్కరిని కటకటాల పాలుచేస్తోంది..లీకేజీతో ఎవరెవరికి లింకుందన్న కోణంలో లోతుగా దర్యాప్తు చేపట్టింది. కేసులో కొత్త లింకులు బయటపడుతున్నాయి. కార్పొరేట్ కళాశాలల సిబ్బందే కాదు.. పెద్ద తలలే ఈ వ్యవహారంలో ఉన్నట్లు సీఐడీ విచారణలో తేలింది. ఎంసెట్ లీకేజీ కేసు తమ మెడకు చుట్టుకుంటుందేమోనని ఉన్నతాధికారుల పీఠాలు కదులుతున్నాయి. ఇద్దరు ఐఎఎస్‌ల పిల్లలతో పాటు ఆరుగురు ప్రభుత్వాధికారుల పిల్లలు ఈ లీకైన ప్రశ్నాపత్రం కారణంగా ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. నిందితుల కాల్ డేటా ఆధారంగా కార్పొరేట్ కళాశాలలకు చెందిన మరికొందరు పెద్దలను అరెస్టు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజెంట్‌గా ఉన్న కమ్మ వెంకట శివనారాయణరావు ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషించినట్లు తేలింది. దిల్‌సుక్‌నగర్ చైతన్య కాలేజీ బ్రాంచ్‌తో పాటు మరో ఆరు కేంద్రాల్లోని కాలేజీలకు డీన్‌గా ఉన్న ఓలేటి వాసుబాబు అరెస్టు కావడం తెలిసిందే. ఆయన ఇచ్చిన సమాచారం ఆధారంగా కొందరు తల్లిదండ్రులను అరెస్టు చేసే అవకాశాలున్నాయి. లీకేజీ వ్యవహారం ద్వారా విద్యార్థులకు ర్యాంకులు రావడం తప్పే అయినా.. అదే తమ గొప్పగా చెప్పకుంటూ శ్రీచైతన్య, నారాయణ సంస్థలు ప్రచారం చేస్తున్నాయని సీఐడీ అధికారులన్నారు. వాసుబాబును గతంలోనూ సీఐడీ అధికారులు విచారించారు. అయితే ఆయనను అరెస్టు చేయలేదు. గతంలో ఎంసెట్ ప్రశ్నాపత్రం లీకేజీలో కీలకంగా వ్యవహరించిన డాక్టర్ ధనుంజయ్, డాక్టర్ సందీప్‌కుయార్‌తో ఆయన ఒప్పందం చేసుకున్నారు. కాలేజీ విద్యార్థుల తల్లిదండ్రు లకు మెడికల్ సీట్లు ఇప్పిస్తామని చెప్పి ముందుగానే ప్రశ్నాపత్రం ఇచ్చేలా అగ్రిమెంట్ చెసుకున్నారు. భువనేశ్వర్ కేంద్రంగా నడిచిన ప్రిపరేషన్ క్యాంపునకు ఆరుగురు విద్యార్థులను పంపారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ.38 లక్షలు వసూలు చేసినట్టు సీఐడీ అధికారులు గుర్తించారు. శివనారాయణ, డీన్ వాసుబాబు తీసుకెళ్లిన విద్యార్థుల్లో కొందరు ప్రభుత్వాధికారుల పిల్లలున్నట్టు అధికారులు తెలిపారు. శ్రీచైతన్య కాకుండా మరో ప్రముఖ కాలేజీ విద్యార్థులను సైతం వాసుబాబు కటక్‌లో శిక్షణకు తరలించినట్టు గుర్తించారు. మరో 12 మంది విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయన ఫోన్ ద్వారా పదేపదే టచ్‌లో ఉన్నట్లు సీఐడీ ఆధారాలు సేకరించింది. త్వరలోనే వారికి కూడా అరెస్టు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. తమ కాలేజీకి పేరు తెచ్చేందుకే ఈ స్కాంలో పాలుపంచుకున్నట్టు వాసుబాబు ఒప్పుకున్నట్లు సీఐడీ అధికారులు తెలిపారు. తాను పంపిన ఆరుగురు విద్యార్థుల్లో ముగ్గురికి మంచి ర్యాంకులు వచ్చాయని, దీంతో వారి నుంచి మరింత డబ్బును వసూలు చేసేలా ఒప్పందం కుదిరినట్టు విచారణ సమయంలో ఆయన తెలిపినట్టు అధికారులు తెలిపారు.

# రవాణా శాఖ విశ్వరూపం

**9 ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు**
**52 ఆటోల సీజ్**

**మద్రిపాలెం(విశాఖ పశ్చిమ) :** పరిమితికి మించిన ప్రయాణికులతో ప్రయాణాలు, రాంగ్ రూట్‌లో రాకపోకలతో పట్టుబడిన 52 ఆటోలను రవాణా శాఖ అధికారులు సీజ్ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన ఆటోల తనిఖీల కోసం జిల్లా వ్యాప్తంగా 9 ప్రత్యేక బృందాలను ఉప రవాణా కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు నియమించారు. ఈ బృంద సభ్యులు శుక్రవారం నగరంతో పాటు గాజువాక, అనకాపల్లి, నర్సీపట్నం రవాణా కార్యాలయాల పరిధిలో తనిఖీలు చేపట్టారు. రాకపోకలు సాగిస్తున్న ప్రతీ ఆటోను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఉప రవాణా కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు స్వయంగా తనిఖీల్లో పాల్గొని కేసులు నమోదు చేశారు. పరిమితికి మించి ప్రయాణికులతో ఆటోలు రాకపోకలు చేయడం చట్టరీత్యా విరుద్ధమన్నారు. మోటార్ వాహనాల చట్టంలోని నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్ల మీద చర్యలు ఉంటాయన్నారు.

# భిక్షగాళ్లు లేని బెజవాడ ?

అమరావతి : నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భిక్షగాళ్లు లేని బెజవాడగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నామని వీఎంసీ కమిషనర్ జె.నివాస్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని నవజీవన్ బాల భవన్‌లో విజయవాడ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లోని భిక్షగాళ్లను వీఎంసీ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గుర్తించిన 80 భిక్షగాళ్లను తెలంగాణకు చెందిన అమ్మ, నాన్న అనాథాశ్రయానికి అప్పగించే కార్యక్రమాన్ని కమిషనర్ నివాస్ పర్యవేక్షించారు. మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన అమ్మ, నాన్న ఫౌండేషన్ భిక్షగాళ్లను, అనాథలను అక్కున చేర్చుకొనే మంచి సంస్థ అని చెప్పారు

# ఎఫ్‌డీఐల తగ్గు ముఖం

- ఐదేళ్ల కనిష్ఠానికి దిగజారిన వైనం
- 2017-18లో 44.85 బిలియన్ డాలర్లు

**న్యూఢిల్లీ :** విదేశీ పెట్టుబడులు ఆకట్టుకోవడంలో నరేంద్ర మోడీ సర్కార్ విఫలమైంది. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) ఐదేండ్ల కనిష్ఠ స్థాయికి జారుకున్నాయి. 2017-18లో మూడు శాతం తగ్గి 44.85 బిలియన్ డాలర్లకు పరిమితమైనట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీయల్ పాలసీ అండ్ ప్రమోషన్ (డీఐపీపీ) తాజా నివేదికలో వెల్లడించింది. అంతక్రితం ఏడాదిలో 8.67 శాతం వృద్ధిని నమోదు చేసుకున్న ఎఫ్‌డీఐలోల 2015-16లో 29 శాతం, 2014-15లో 27 శాతం, 2013-14లో 8 శాతం చొప్పున పెరిగాయి. 2012-13లో మాత్రం ప్రతికూల వృద్ధి 38 శాతం ఉంది. భారత్‌లో పెట్టుబడులు నిలిచిపోవడం, సులభతర వాణిజ్యంలో మెట్టుపైకి ఎక్కినప్పటికీ విదేశీ పెట్టుబడులను ఆకట్టుకోవడంలో దేశం విఫలమవుతున్నదని విశ్లేషకులు వెల్లడించారు. ఈ సందర్భంగా డెలాయిట్ ఇండియా భాగస్వామి అనిల్ తల్రేజా మాట్లాడుతూ...కన్స్యూమర్, రిటైల్ రంగాల్లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు కారణంగా ఎఫ్‌డీఐలు తగ్గడానికి ప్రధాన కారణమని, అలాగే ఎఫ్‌డీఐ పాలసీలు అస్పష్టంగా ఉండటం ఈ ప్రభావాన్ని మరింత పెంచిందన్నారు. ఎఫ్‌డీఐలను ఆకట్టుకోవడానికి కేంద్రం మరిన్ని సంస్కరణలు, సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉన్నదని, అప్పుడే మరిన్ని పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికీ అంతర్జాతీయ కన్స్యూమర్, రిటైల్ కంపెనీ లు భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికి వెనుకడుగు వేస్తున్నాయని చెప్పారు. గడిచిన కొన్ని సంవత్సరాలుగా దేశీయంగా పెట్టుబడులు తగ్గుముఖం పట్టాయని, ప్రసుత్తం ఎఫ్‌డీఐలు కూడా ఇదే తీరును కొనసాగిస్తుండటం ఆందోళన కలిగిస్తున్నదని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ బిస్వాజిత్ ధార్ తెలిపారు. గతేడాది సేవల రంగంలోకి 6.7 బిలియన్ డాలర్లు, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లోకి 6.15 బిలియన్ డాలర్లు టెలి కమ్యూనికేషన్స్ 6.21 బిలియన్ డాలర్లు, ట్రేడింగ్ 4.34 బిలియన్ డాలర్లు, నిర్మాణ 2.73 బిలియన్ డాలర్లు, ఆటోమొబైల్ 2 బిలియన్ డాలర్లు, ఇంధన రంగంలోకి 1.62 బిలియన్ డాలర్లు వచ్చాయి. దేశాల విషయానికి వస్తే మారిషస్ నుంచి అత్యధికంగా 15.94 బిలియన్ డార్ల పెట్టుబడులు వచ్చాయి. సింగపూర్ నుంచి 12.18 బిలియన్ డాలర్లు, నెదర్లాండ్స్ నుంచి 2.8 బిలియన్ డాలర్లు, అమెరికా నుంచి 2.1 బిలియన్ డాలర్లు, జపాన్ నుంచి 1.61 బిలియన్ డాలర్ల చొప్పున వచ్చాయని డీఐపీపీ వెల్లడించింది.



ఎస్ఆర్ఎం యూనివర్సిటీ గేమింగ్ వర్క్‌షాపులో మాట్లాడుతున్న పేటెంట్ లాయర్లు బాలాజి, మిస్ ఎస్. నిత్య,పేటెంట్ ఏజెంటు కంపెనీ ఆర్కే దివాన్



ఎస్ఆర్ఎం యూనివర్సిటీ,అమరావతిలో విద్యార్థులతో సంభాషిస్తున్న ప్రొఫెసర్ మార్క్ హెచ్.మెయర్, మేనేజింగ్ డైరెక్టర్ సెంటర్‌ఫర్ ఎంట్రిప్రెన్యూర్‌షిప్, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ



ఎస్ఆర్ఎం అధ్యాపకులకు పేటెంట్స్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ, ప్రొసీజర్స్‌ను వివరిస్తున్న న్యాయవాది

# అత్యుత్తమ విద్యావిష్కరణలకు
# ఎస్ఆర్ఎం యూనివర్సిటీ




ఎస్ఆర్ఎం యూనివర్సిటీ భవన సముదాయాలు

**రాజధాని వార్తలు, అమరావతి :** దేశంలోనే ప్రసిద్ధిగాంచిన శ్రీ రామస్వామి మెమోరియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ & టెక్నాలజీ (ఎస్ఆర్ఎం) ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో అత్యుత్తమ స్థానంలో ఉంది. 1985లో డాక్టర్ టీఆర్ పరివెంధర్(టీఆర్ పచ్చైముత్తు) చెన్నైలో దీన్ని నెలకొల్పారు. దినదిన ప్రవర్ధమానంగా ఎదిగిన ఎస్ఆర్ఎం అన్ని కోర్సులతో సంపూర్ణ విశ్వవిద్యాలయంగా రూపుదిద్దుకొంది. ఈ వర్సిటీకి నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో సహా దేశవ్యాప్తంగా 8 క్యాంపస్‌లు ఉన్నాయి.



ప్రొ.వైస్ ఛాన్సలర్, ప్రొ. డాక్టర్ డి. నారాయణరావు

ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ ప్రమాణాలు గల ఉన్నత విద్యా సంస్థను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానం మేరకు అమరావతికి ఎస్ ఆర్ ఎం విశ్వవిద్యాలయం తరలి వచ్చింది. 2017 ఫిబ్రవరి 15న 200 ఎకరాల్లో నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేయగా, ప్రపంచంలోనే ప్రముఖ విశ్వవిద్యాలయాలకు రూపకల్పన వహించిన పెర్కిన్స్, విల్ వంటి అమెరికన్ ఆర్కిటెక్చర్ల ఆధ్వర్యంలో కేవలం ఆరునెలల్లో అమరావతి క్యాంపస్‌ను నిర్మించారు. అదే ఏడాది జులై 1న ముఖ్యమంత్రి, అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, ప్రస్తుత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని ప్రారంభించామని అమరావతి ఎస్.ఆర్. ఎం విశ్వవిద్యాలయం ప్రొ.వైస్ ఛాన్సలర్ డాక్టర్ నారాయణరావు రాజధాని వార్తలకు వివరించారు.

అమరావతి ఎస్ఆర్ఎంను రానున్న ఐదేళ్లలో 10,000 విద్యార్థులు, 2028 నాటికి 18,000 విద్యార్థులతో బహుముఖ విద్యా సంస్థగా తీర్చిదిద్దాలన్నది లక్ష్యమన్నారు. 2017లో ఇంజినీరింగ్ కోర్సులతో తరగతులు ప్రారంభం కాగా, **అంతర్జాతీయ అనుభవజ్ఞులైన పిహెచ్‌డి లు ఉన్న ఉపాధ్యాయ బృందం, చదువులో ముందజుగా ఉండి అభివృద్ధిలోకి రావడంతో ఈ ఏడాది ఇంజనీరింగ్‌లోని అన్ని విభాగాల అడ్మిషన్లకు మంచి డిమాండు వచ్చిందన్నారు.** ఈ విద్యా సంవత్సంలో ఇంజినీరింగ్ డిగ్రి కోర్సులతోపాటు ఎంటెక్, పిహెచ్‌డీ, లిబరల్ ఆర్ట్స్, బేసిక్ సైన్స్‌లో విద్యాబోధన నిమిత్తం బీఏ, బీకాం. బీఎస్సీ,బీబీఏ కోర్సులను కూడా ఎస్ ఆర్ ఎం విశ్వవిద్యాలయం ప్రారంభించింది. బీఏలో ఇంగ్లీష్, చరిత్ర, సామాజిక శాస్త్రం, అర్ధశాస్త్రం,




జర్నలిజం, బీఎస్సీలో కెమిస్ట్రి, ఫిజిక్స్, మేధమెటిక్స్, బయాలజి, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులతో ప్రవేశాలను చేపట్టింది.దశల వారీగా మేనేజ్‌మెంట్, సైన్స్ అండ్ హ్యూమానిటీస్, లిబరల్ ఆర్ట్స్, లా, వైద్య విద్య వంటి కోర్సులను ప్రవేశపెట్టడానికి విశ్వవిద్యాలయం ప్రణాళికలు రూపొందిస్తోంది.

దేశవ్యాప్తంగా ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేట్లు, అండర్ గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంటట్ మెడిసిన్, హెల్త్‌సైన్సెస్, హ్యూమనిటీస్ వంటి వివిధ కోర్సుల్లో 38 వేల మంది విద్యార్థులు ఉండగా వారికి 2,600 మంది ఉపాధ్యాయులు అత్యుత్తమ విద్యాభోధనను అందిస్తున్నారు. విదేశీ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యాబోధనేకాకుండా పరిశోధనా ప్రోగ్రాములు కూడా అందిస్తున్నారు. నానోటెక్నాలజీ, బయోఇన్‌ఫర్మేటిక్స్, జెనటిక్ ఇంజనీరింగ్, రిమోట్ సెన్సింగ్, జీఐఎస్, ఎంబెడెడ్ సిస్టమ్స్, కంప్యూటర్ ఫోరెన్సిక్‌ల వంటి ఆధునిక కోర్సులను ఎస్ఆర్ఎం అందిస్తోంది. అనేక దేశాల నుంచి విద్యనభ్యంసించేందుకు ఇక్కడి వస్తున్నారు.

ఇక్కడ చదివే 150 మంది స్టూడెంట్లకు 35 విదేశీ వర్సిటీలు స్పాన్సర్ చేస్తున్నాయి. వాటిలో ఎమ్.ఐ.టీ, కార్నేగీ మిల్లాన్, యూసీ డెవిస్, వార్‌విక్, వెస్ట్రన్ ఆస్ట్రేలియా వంటివి ఉన్నాయి.

## పారిశ్రామిక శిక్షణా కేంద్రం

జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థల భాగస్వామ్యంతో అధ్యాపకులు, విద్యార్థులు వివిధ అంశాల్లో పరిశోధనలు కొనసాగించడానికి వీలుగా ఒక పారిశ్రామిక శిక్షణ కేంద్రం ఏర్పాటుకు ఎస్ఆర్ఎం నిర్ణయించిందని డా. నారాయణరావు వివరించారు. ఈ కేంద్రంలో పారిశ్రామిక సంస్థలకు అవసరమైన పరిశోధనలను కూడా విశ్వవిద్యాలయం చేపడుతుంది. దాని ఫలితంగా ఈ విశ్వవిద్యాలయం విద్యార్థులు పారిశ్రామిక సంస్థలో ఇంటర్న్‌షిప్ చేయడానికి వీలుకలుగుతుంది. తమ పరిశోధన కేంద్రంలో ఒక ప్రత్యేక కేంద్రం ఏర్పాటుకు ప్రముఖ కార్ల తయారి సంస్థ రోల్స్‌రాయ్‌తో విశ్వవిద్యాలయం చర్చలు జరుపుతోందని ఆయన వెల్లడించారు.

## ప్రత్యేక పరిశోధన, అధ్యయన కేంద్రాలు

ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయానికి అనుబంధంగా తొమ్మిది ప్రత్యేక పరిశోధన, అధ్యయన కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. వాటిలో హైడ్రోజన్ ఆధారిత రైలు, సెంటర్ ఆఫ్ క్లౌడ్ కంప్యూటింగ్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, శాటిలైట్ టెక్నాలజి, సెంటర్ ఫర్ డ్రోన్స్,సెంటర్ ఫర్ రెన్యూవబుల్ ఎనర్జి,సెంటర్ ఫర్ బ్లూ ఎకానమి, సెంటర్ ఫర్ క్రిస్పర్ కేంద్రాలున్నాయి.

**అంతర్జాతీయ సలహా బోర్డు (ఇంటర్నేషనల్ అడ్వయిజరీ బోర్డు)**

ఎస్ఆర్ఎంకు మాత్రమే ప్రత్యేకం. ఇందులో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన వర్సిటీలైన ఎమ్.ఐ.టీ, స్టాన్‌ఫోర్డ్, యూసీ బర్క్‌లీ, కేంబ్రిడ్జి సంస్థల్లోని 50 మంది సభ్యులు అంతర్జాతీయ స్థాయి విద్యాబోధనకు అహరహం శ్రమిస్తుంటారు.

**కార్పొరేట్ అడ్వయిజరీ బోర్డు**

ప్రఖ్యాతిగాంచిన కార్పొరేట్ సంస్థలకు చెందిన 60 మంది ప్రముఖులు అకడమిక్స్, రీసెర్చ్, సహాయ సహకారాలు అందిస్తున్నారు.

**అక్రిడిటేషన్**

ఎస్ఆర్ఎం వర్సిటీకి 2013లోనే నాక్ (ఎన్ఏఏసీ) 'ఏ' గ్రేడు నిచ్చింది. మానవవనరుల మంత్రిత్వశాఖ ఈ కళాశాలను ఏ కేటగిరిలో చేర్చింది. కౌన్సెలింగ్ సమయంలోనే బ్యాంకు రుణాలు పొందవచ్చు. ఎస్ఆర్ఎం నిర్వహించే ఎస్ఆర్ఎం ఈఈఈ, జేఈఈ, ఏఐఈఈఈ ప్రవేశపరీక్షల్లో రాష్ట్ర ర్యాంకర్లకు ఫీజు మినహాయింపు ఉంటుంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందంగా నేర్చుకొనే సౌలభ్యంతోపాటు విద్యార్థులను ప్రపంచ స్థాయి విద్యావిష్కర్తలుగా సమాయత్త పరిచే ప్రక్రియలో ఎస్ఆర్ఎం ముందుంది. దేశంలోని ఏ మూల నుంచి విద్యార్థులు వచ్చినా అందరికీ అవకాశాలను కల్పిస్తూ, విద్యా, పరిశోధన, ఆవిష్కరణలను రూపొందించే ఏకైక కేంద్రం ఎస్ఆర్ఎం.అంతర్జాతీయ విద్యాసంస్థలతో మమేకమైన ఈ సంస్థలో అత్యుత్తమ విద్యకోసం ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని 10:1 పాటిస్తున్నారు.



ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రాంగణం



ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ల్యాబ్ పరికరాలు

## గేమింగ్‌లో నైపుణ్య శిక్షణ

కేవలం విద్యాసంస్థగానే కాకుండా జాతీయ, ప్రాంతీయ అభివృద్ధిలో కూడా ఎస్ఆర్ఎం చురుకైన పాత్ర పోషిస్తోంది. అందులో భాగంగా రాజధాని అమరావతి ప్రాంతంలోని నిరుద్యోగులు, విద్యార్థులను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఎన్ఎస్‌డీసీ), కాజాని యూనివర్శిటీ, ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డుతో కలిసి విద్యార్థులకు సంయుక్తంగా గేమింగ్ (ఇండియన్ గేమింగ్ డెవలప్‌మెంట్ ఛాలెంజ్(ఐజీడీసీ))లో నైపుణ్య శిక్షణ అందచేస్తోంది. ఐజీడీసీ ప్రోగ్రాం ద్వారా 120 కళాశాలల నుంచి 500 మంది విద్యార్థులను ఎంపికచేసిందని ఏపీఎస్ఎస్‌డీసీ డైరెక్టర్ గంటా సుబ్బారావు వివరించారు. ఎస్ఆర్ఎం ఆతిధ్యమిస్తున్న ఈ కార్యక్రమంలో 50 గ్రూపుల విద్యార్థులు పాల్గొంటారు. ఫిన్లాండ్ కాజాని యూనివర్శిటీకి చెందిన 8 మంది నిపుణులు ఒక గేమింగ్ కంపెనీ స్థాపించడానికి అవసరమైన ఐడియా, డిజైన్, ప్రొగ్రామింగ్, ప్రోడక్షన్, మార్కెటింగ్, సేల్స్‌లలో శిక్షణ ఇస్తున్నారు. క్లాస్ రూమ్ బోధనతో కాకుండా గ్రూప్ డిస్కషన్స్‌తో ఎక్కువగా నేర్చుకునే అవకాశం విద్యార్థులకు ఉంది. ఈ ప్రోగ్రాం ద్వారా వివిధ ఎలక్ట్రానిక్, సోషల్‌మీడియాలలో ఆడుకునే గేమ్స్ రూపొందించే విధంగా శిక్షణ ఇస్తున్నారు. దీంతో విద్యార్థులకు ఓత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఇండియాలో గేమింగ్‌కు గొప్ప అవకాశం ఉందని మన స్టూడెంట్స్ ద్వారా సూపర్‌సెల్ (ఫిన్‌ల్యాండ్ కంపెనీ) లాంటి గొప్ప గేమింగ్ కంపెనీ ఆవిర్భవించే అవకాశం ఉందని ఆయన తెలిపారు.




ఏపీఎస్ఎస్‌డీసీ డైరెక్టర్ గంటా సుబ్బారావు


**ఇంజనీరింగ్ విద్యార్థుల్లో నైపుణ్య కొరత**

మనదేశం నుంచి ప్రతి ఏడాది బయటకు వస్తున్న లక్షలాది మంది ఇంజనీరింగ్ విద్యార్థుల్లోని తీవ్రమైన నైపుణ్య కొరతను ఈ కార్యక్రమం అధిగమిస్తుంది. దీంతో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ఇంజనీరింగ్‌లో మొదటి,రెండవ సంవత్సరం విద్యార్థులకు గైడెన్స్, కెరీర్ కౌన్సెలింగ్‌తో పాటు ఇండస్ట్రీకి అవసరమయ్యే సాఫ్ట్‌వేర్ టూల్స్, కంప్యూటర్ శిక్షణ, లాంగ్వేజెస్, వెబ్ అప్లికేషన్ తయారీపై మూడు వారాల శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే ప్రయత్నమే దీని ప్రధాన ఉద్దేశం.


**ఎస్ఆర్ఎంలోని మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, అంతర్జాతీయ ల్యాబ్‌లు అద్భుతంగా ఉన్నాయన్నారు. కాలేజీ యాజమాన్యం, ఎల్లప్పుడూ విద్యార్థులకు అందుబాటులో ఉండే ప్రొ.వీసీ. డాక్టర్ నారాయణరావుతో ఎస్ఆర్ఎం వర్సిటీ దినాదినాభివద్ధి చెందుతుందని తెలిపారు.**



ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయ అధ్యాపకుల్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ మార్క్ హెచ్.మెయర్



ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరుగుతున్న గేమింగ్ వర్క్‌షాపు విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీఎస్ఎస్‌డీసీ డైరెక్టర్ డా.కె.లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి.



ఎస్ఆర్ఎం గేమింగ్ వర్క్‌షాపులో శిక్షణ పొంది ఏపీఎస్ఎస్‌డీసీ ఇన్నోవేషన్ సదస్సులో పాల్గొన్న ఫిన్‌ల్యాండ్ వర్సిటీ ఉపాధ్యాయులు, విద్యార్థులు


### శిక్షణ పొందటం ఆనందదాయకం



గేమింగ్ తయారీలో ముఖ్యంగా డిజైన్, ఆర్టిస్టిక్ వర్క్, ప్రొగ్రామింగ్, ప్రొడక్షన్ విభాగాల్లో ఫిన్‌ల్యాండ్ యూనివర్సిటీ ఆధ్యాపకులు చక్కని ఇంటరాక్షన్‌తో బోధిస్తున్నారు. ఇవే కాకుండా మార్కెటింగ్, రెవెన్యూ జెనరేషన్‌లలో కూడా శిక్షణ ఇవ్వటం బావుంది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రెండు నెలల శిక్షణలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది.

**– చందన, కమ్యూనిటీ మేనేజర్, ఐజిడిసి**

### కేరీర్ ప్రారంభం సంతోషం



ఆహ్లాదకర వాతావరణంలో కెరీర్‌ను మొదలు పెట్టడం, ఒక ప్రణాళిక ప్రకారం గేమింగ్‌తో అభివృద్ధి పొందటం ఎంతో ఆనందంగా ఉంది. ఏపీఎస్ఎస్‌డీ కో ఆర్టినేటర్లు, ఎస్ఆర్ఎం సిబ్బంది, ఫిన్‌లాండ్ వర్సిటీ టీచర్లు సహాయ సహకారాలు అందిస్తున్నారు. వారికి కృతజ్ఞతలు.

**– అశ్వని, ఎస్.వి మహిళా కళాశాల తిరుపతి**

### ఉద్యోగం సాధిస్తా



కొత్త గేమ్స్ నేర్చుకుంటున్నాం. దీంతో గేమింగ్ ఉద్యోగం తెచ్చుకునే అవకాశం ఉంది. దేశంలో ఈ రంగంలో అపార అవకాశాలున్నాయి.

**– సాయి, తూర్పుగోదావరి**

### సొంతంగా డిజైన్ చేస్తున్నా



చిన్న గ్రూపులలో నేర్చుకుని సొంతంగా డిజైన్ చేయటంలో మంచి శిక్షణ ఇస్తున్నారు. ఇదొక మంచి అవకాశం.

**– శ్రీవల్లి, ఒంగోలు క్రిక్ ఇంజనీరింగ్ కళాశాల**

### ఈ అవకాశం అదృష్టం



గేమింగ్ ప్రొగ్రామింగ్ శిక్షణలో మంచి గేమ్ ఐడియాలతో కొత్త వాటిని తయారుచేస్తున్నాం. ముఖ్యమంత్రిగారి చోరవతో ఎస్ఆర్ఎం అతిధ్యంమివ్వడం, మాకు ఈ అవకాశం రావటం అదృష్టంగా భావిస్తున్నా.

**– బాలసాయి తేజ**

### ఉద్యోగం ఖాయం



త్వరగా గేమింగ్ తయారీ చేయడం నేర్చుకున్నా. ఈ రంగంలో ఉన్న అవకాశాలతో మంచి ఉద్యోగంలో సంపాదిస్తాను.

**– అలీషారాయ్, స్వర్ణాంధ్ర ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ**


### ఇరు సంస్థలకు ధన్యవాదాలు



ఇక్కడనేర్చుకున్న నైపుణ్యంతో సొంతంగా గేమింగ్ కంపెనీని ప్రారంభిస్తా.. అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఎస్ఆర్ఎం, ఏపీఎన్ఎస్‌డీసీ సంయుక్తంగా చేస్తున్న కృషికి ధన్యవాదాలు.

**– మేఘన**

### ఉపాధి అవకాశాలు పెరుగుతాయి



మొబైల్ గేమింగ్‌కు సంబంధించి అన్ని విషయాలపై రెండునెలల శిక్షణ నిస్తున్నాం..ఇందుకోసం విద్యార్థులను 5 నుంచి 10 మందితో బృందాలుగా ఏర్పాటు చేశాం. విద్యార్థుల్లో సృజనాత్మకతోపాటు ఆలోచన, ఆకృతి, అభివృద్ధి, ఉత్పాదన, మార్కెటింగ్, సేల్స్, వంటివాటిపై అవగాహన కల్పించి విద్యార్థుల్లో భరోసా నింపుతాం. ఒక ఆలోచనను ఆటగా మార్చడం, అది అందరికి అందుబాటులో ఉండేవిధంగా రూపొందించడంపై 8 మంది ఫిన్లాండు ఉపాధ్యాయులు విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. ఎస్ఆర్ఎం ఆతిధ్యం సూపర్. రెండునెలల కార్యక్రమంలో మొదటి రెండు వారాలు ముందుపరిచయ తరగతులు, సొంతంగా గేమ్ తయారు చేయడం, ఆన్,ఆఫ్ లైన్లలో వెబ్‌టూల్స్ శిక్షణ ఇస్తున్నాం. దీంతో ఖచ్చితంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

**– జాకో కర్కోల**

### యువతులే ముందున్నారు



ఇక్కడి విద్యార్థులలో గేమింగ్ నైపుణ్యం తక్కువగా ఉంది. అయినా యువతరం త్వరగా నేర్చుకుంటుంది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను తయారు చేసే ప్రయత్నంలో ఇదొక నూతన ప్రక్రియ. గేమ్‌లకు సంభంధించిన ఆన్‌లైన్ టూల్స్, ప్రొగ్రామింగ్ లాంగ్వేజెస్, ఇతర కంప్యూటర్ ప్రొగ్రాంలను నేర్పుతున్నాము. ఏ గేమ్‌కు ఏ ప్రొగ్రాం వాడాలో తెలుసుకుని వాటి ద్వారా గేమ్‌లు విద్యార్థులు తయారు చేస్తున్నారు. ప్రతి గ్రూపునకు మేము ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుని నేర్పించటానికి ప్రయత్నిస్తున్నాం. ఆన్‌లైన్ లోని 'మూడుల్' ద్వారా విద్యార్థులు స్వయం శిక్షణ పొందుతున్నారు.గేమింగ్ నైపుణ్యతలు ఫిన్‌లాండ్ విద్యార్థుల కంటే కొంచెం తక్కువే. అయినా యువతులు శ్రద్ధగా నేర్చుకుంటూ ప్రాక్టిసు చేస్తున్నారు.

**– జోయల్, లార, జానా**

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699, Email : rajadhanivartalu1@gmail.com